بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّى عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 22.08.2014 (TELUGU)

**మనము అతిథుల సేవ చేయవలెను. మనకు నిజమైన సంతోషము కలిగించే నిజమైన సేవ చేయవలెను. మన సమీప అతిథిని చూసి కలిగే ఆనందమే వచ్చే మన ప్రతి అతిథితో కలుగవలెను. ఇటువంటి సంతోషము కలిగినప్పడే సేవా హక్కు కూడ చెల్లించబడును.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 22.08.2014 తేదిన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠానానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

అల్లాహ్ కృపానుసారము ఆచ్చే శుక్రవారము నుండి ఇంగ్లాండ్ వార్షిక సభ మొదలగును. సభా ప్రాంగణంలో ఇప్పటికే చాలా వరకు ఏర్పాట్లు పూర్తి అయినవి. అతిథుల రాక కూడ ప్రారంభమయ్యెను. సభా శుభములను పొందుటకు ప్రయాణము చేయుచున్న, ప్రయాణములో వున్న లేదా వచ్చిన, మున్ముందు వచ్చే వారిందరిని అల్లాహ్ రక్షించుగాక! అల్లాహ్ అందరిని తన సంరక్షణలో వుంచుకొనుగాక! అహ్మదీయులనే కాక ప్రపంచములోని ప్రతి వ్యక్తిని, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను ఏ శాంతి కొరకు అల్లాహ్ పంపెనో దానిని వారు పొందుగాక!

మన సభ ఏర్పాట్లు ఉచిత సేవాకారక్రమాలతో జరుగునను విషయము మనకు తెలుసు. కనుక సభ కంటే ఒక శుక్రవారము ముందే నేను సేవలకు వారి బాధ్యతల గురించి సూచింతును. ఇప్పుడు నేను కొన్ని విషయాలు సేవకుల గురించి సేవకులకు తెలిపెదను.

ఏది ఏమైనా అతిథుల గురించి కొన్ని విషయాలను సేవకులకు చెప్పెదను. వార్షిక సభ కేంద్రీకృతముగనే ఈ విషయములుండును. సభకు వచ్చే అతిథులు కేవలము సభ కొరకు వచ్చుచుందురు. సభలో పాల్గొనే వారి ఉద్ధేశము ఇదే వుండవలెను. ఈ ఉద్ధేశమున్నచో అతిథి ప్రాముఖ్యత అనేక రెట్లు పెరుగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సభలో పాల్గొనుటకు సూచించినట్లు, ధార్మిక ఉద్ధేశాల కొరకే ఈ సభను కేటాయించినట్లు, దైవ ప్రీతిని పొందుటకు కారణముగా నిర్ణయించినట్లు మనము ప్రత్యేకంగా చూడవచ్చును. ఇటుల దీని ప్రాధాన్యత ఎంతో పెరుగును.వచ్చేవారు స్వలాభము కొరకు రారు. ఏదేని ప్రపంచ వేడుకకు రారు.ఎవరైనా ఈ ఉద్దేశముతో వచ్చినను తన పుణ్యమును వృధా చేసుకొనును. ఇక్కడికి వచ్చే అతిథులు సేవ కొరకు వివిధ శాఖలలో పని చేయుటకు వినమ్రులు తమను తాము సమర్పింతురు. వీరు సాధారణ అతిథులు కారు. వర్తమాన ఇమామ్ స్థాపించిన వ్యవస్థలో మేమున్నామని హాజరైన వారు. అల్లాహ్ కొరకు ప్రోగైన అతిథులు వీరు.

ఈప్రయాణము అన్ని విధాలా శుభప్రదము కావలెనని కొన్ని సార్లు తమ శక్తిని మించి ఖర్చు చేసి చాలా దూరము నుండి ఇక్కడికి వచ్చెదరు. వర్తమాన ఖలీఫాతో కలిసే భాగ్యము కలుగునని కూడ ఖిలాఫత్‌తో గల ప్రేమ వారిని ఇందుకు ప్రోత్సహించును. ప్రపంచములోని వివిధ దేశాలనుండి ప్రజలు వచ్చెదరు. క్రొత్త, పాత అహ్మదీయులు కూడ వున్నారు. ఈ వచ్చేవారి కనులలో ఖిలాఫత్‌తో గల ప్రేమను చూసి ఎలా విశ్వాసుల హృదయాలలో ఖిలాఫత్‌తో ప్రేమ పుట్టించుచున్నాడని అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపెదను. ఇది ఏ మానవుని

కృషితో జరగలేదు. ఇస్లాం నిజమైన బోధనను ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశముతో ఈ కాలములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను అల్లాహ్ పంపి, వారి తర్వాత ఈ వ్యవస్థను ప్రారంభించెను. ఇస్లాం ప్రేమానురాగ సందేశము ప్రపంచానికి అందించవలెను. నిజమైన ఇస్లామే ఇప్పుడు ప్రపంచ శాంతి అని ప్రపంచానికి తెలుపుటకే, ఈ విషయమును చూచుటకు, వినుటకు, నేర్చుకొనుటకు ప్రజలు ఇక్కడికి వచ్చెదరు. ఈ కారణము వల్లనే ఖిలాఫత్‌తో ప్రేమ గలదు. సభ ఆధ్యాత్మిక వాతావరణంతో ప్రయోజనము పొందుటకు అనేకులు ఇంగ్లాండ్ సభకు వచ్చెదరు. విద్యా, సంస్కరణ, ధార్మిక కార్యక్రమాలలో పాల్గొనెదరు. వీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం దుఆల వారసులగుదురు, వర్తమాన ఖలీఫాతో కూడ భేటి అగుదురు. ప్రపంచములో ఏ ఇతర బంధములో లభించని ఉత్తేజము ఇక్కడికి వచ్చేవారిలో వుండును. ఈ విషయము వైపే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సూచించిరి.

కావున ఇక్కడికి వచ్చే అథితుల ఒక ప్రత్యేక స్థాయి, వారి ప్రాముఖ్యత గలదు. అందుకే ఈ అథితుల సేవ చేయువారి ప్రాముఖ్యత కూడ పెరుగును. ఈ ప్రాముఖ్యతను గుర్తించుచు జమాఅత్ సభ్యులు తమను తాము సేవకు సమర్పింతురు. ప్రాపంచిక పరంగా ఒక అధికారిని, అధిక అధికాదాయము గల వ్యక్తిని దేగులపై, ఆహారము, రొట్టెలు వండుటకు, వివిధ పనులపై నియమించబడును. తుదకు మరుగుదొడ్లను శుభ్రపరచే పనిలో పెట్టినా సంతోషముతో ఈ పని చేయును. ఎందుకనగా ఈ అథితుల సేవతో అతడు అనంత దుఆలకు వారసుడగును. ఈ సేవకులే అహ్మదియేతరులకు ప్రచారము చేయుటకు కూడ కారకులగుదురు. ఒక బాలుడు కూడ సభాప్రాంగణములో నీరు త్రాగించినను, అతడు మౌన ప్రచారమును చేయును. మేము ప్రపంచములో పీడనము సృష్టించుటకు కాదు ప్రాపంచిక, ఆధ్యాత్మిక నీరు త్రాగించువారము. అథితి ప్రాముఖ్యతతో అథితి సేవకుని ప్రాముఖ్యత కూడ పెరుగును. ఇది ప్రపంచములో ఎక్కడా కనిపించదు. ఇటువంటి అథితులకు సేవ చేయుట తమను తాము సమర్పించి దైవ ప్రీతిని పొందువారు ఎంతో అదృష్టవంతులు. పవిత్ర ఖురాన్‌లో కూడ అథితి సేవ ప్రాముఖ్యత ప్రస్తావించబడెను. హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం స్థాయి, విశిష్టతలను తెలుపుచు అథితిసేవా గుణమును కూడ ప్రస్తావించనైనది. నిస్వార్థముగా అథితి సేవ చేయువారికి అల్లాహ్ ఆస్థానములో ఒక స్థాయి గలదు. ఎందుకనగా అథితుల సేవతో అల్లాహ్ రాజీ అగునని వారు భావింతురు. అల్లాహ్ ప్రీతియే వారి ఉద్దేశముండును. ఏ కోరిక, ఏ అవసరము, కృతజ్ఞతను పొందుట వారి ఉద్దేశముండదు.

ఎటువంటి ప్రాపంచిక ఉద్దేశము లేకుండా అల్లాహ్ కొరకు ప్రయాణము చేయుచున్న వారి ఉదాహరణ ప్రపంచములో లభించదు. అల్లాహ్ ప్రీతి కొరకు అథితి సేవ చేయు వారి ఉదాహరణ కూడ లభించదు. ఈ అందమైన దృశ్యము మనకు అహ్మదియ్య సంస్థలోనే లభించును. ఎందుకనగా అల్లాహ్, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశము మేరకు ఈ కాలపు ఇమామ్‌ను మేము విశ్వసించితిమి. ఎందుకనగా మేము ఖిలాఫత్ గొలుసులో పొదగబడితిమి. ఎందుకనగా ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత ఇత్తుమను ప్రతిజ్ఞ మేము చేసినాము. ప్రతి సంవత్సరపు అనుభవము ఏమనగా ప్రతి చిన్న, పెద్ద స్త్రీ, పురుషుడు, బాలుడు, యువకుడు, వృద్ధుడు ఒక ప్రత్యేక ఉత్తేజముతో సేవ చేయును. ఇదే ఉత్తేజముతో ఇన్షాఅల్లాహ్ ఈ సంవత్సరము కూడ సేవ చేయబడును, చేయబడుతుంది. శ్రమదాన నివేదికలు నాకు అందుచున్నాయి. వాటి ప్రకారము అనుభవము లేని యువకులు కూడ ఈ సంవత్సరం అల్లాహ్ కృపానుసారము పాల్గొంటున్నారు. కనుక సరైన మార్గదర్శనము చేయుట మన కర్తవ్యము. సరైన మార్గదర్శనము లభించుటకే గుర్తు చేయాలని అల్లాహ్ ఆదేశము కూడ గలదు.

నిశ్చయముగా సరైన మార్గదర్శనము, గుర్తు చేయడముతో మనసులలో మార్పు సంభవించును. క్రొత్తగా చేరువారిలో అనేకులకు జమాఅత్ విధానము పూర్తిగా తెలియదు. సేవ వాస్తవమును తెలుపుట వారికి తప్పనిసరి. ఈ క్రొత్తగా చేరువారు ఇతరుల ఆదర్శమును చూసి తమను తాము సమర్పింతురు. అయినను గుర్తు చేయవలసిన అవసరముండును. ఇదే విధముగా పిల్లలు పాల్గొంటున్నారు. అథితుల సేవ ఏ విధముగా చేయవలెనో వారికి కూడ విధుల గురించి, సేవ చేయుట గురించి గుర్తు చేయవలసిన అవసరముండును. సేవ ప్రాముఖ్యతను తెలపుటకు ఉపదేశము చేయవలసివచ్చును. అందుకే అల్లాహ్ ఆదేశమిట్లు గలదు. وَّذَكِّرْ فَاِنَّ الذِّكْرٰى تَنْفَعُ الْمُؤْمِنِيْنَ (అజ్జారియాత్:56) అనగా నీవు ఉపదేశించుచుండుము. నిశ్చయముగా ఉపదేశము విశ్వాసులకు లాభము కలగించును. అల్లాహ్ ఏ ఆదేశము వివేకరహితముగా వుండదు.

వీరు మన ప్రయాణికులు, మన అథితులు, వారికి సేవ చేయువలెను, వారితో మంచిగా వ్యవహరించవలెనను భావన ప్రతి డ్యూటి ఇచ్చే స్త్రీ, పురుషునికి వుండవలెను. కొన్ని సమయాలలో కొందరు అథిథుల ప్రవర్తన కూడ చెడుగా వుండవచ్చును. అయినను ప్రతి సేవకుడు విశాల దృక్పథముతో పని చేయవలెను. డ్యూటీ ఇచ్చే ప్రతి వ్యక్తి సహనముతో ప్రవర్తించవలెను. ప్రతి శాఖ ఉద్యోగి తమ కర్తవ్యములను నిర్వర్తించవలెను. అథితిని ఏ విధముగా చూడవలెనో ప్రవక్త ఉదాహరణతో అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో మనకు తెలిపెను. అథితి సలాంనకు అంతకు మించిన రీతిలో సమాధానము ఇవ్వవలెను. అతని కొరకు పుణ్య భావాలు తెలుపవలెను. అతనికి శాంతి, రక్షణ కల్పించవలెను. ఆనందము వ్యక్తపరచవలెను. ఆనందము కలిగినప్పుడే నిజమైన శాంతి ఏర్పడును.

మనము అథితులకు సేవ చేయాలను విషయమును అనుక్షణం గుర్తుంచుకోవలెను. ఒక సమీపున్ని చూసి కలిగే ఆనందము మనకు ప్రతి అథితి వచ్చినప్పుడు కలుగవలెను. సంతోషము కలిగినప్పుడే సేవ హక్కు చెల్లించబడును. అందుబాటులో వున్న మొత్తం వసతులలో, పరిస్థితులకనుగుణంగా ఉత్తమ ప్రామాణికములతో అథితి సేవ చేయవలెను. నిర్వహకులు ఈ విషయము పట్ల సదా దృష్టిసారించవలెను.

ఉత్తమ వసతి కల్పించే ఆథిత్యమును అల్లాహ్ మనతో కోరును. అల్లాహ్ ఆజ్ఞలను అందరికంటే గొప్పగా అర్థము చేసుకునే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దీని గురించి మనకెట్లు మార్గదర్శనము చేసిరి. వారిట్లనిరి. అథితికి మీపై గల హక్కును చెల్లించుము. అథితులు ఎక్కువ వచ్చినప్పుడు అథితులను అనుచరులలో పంచి పెట్టి తన భాగములో కూడ కొందరిని తీసుకున్న ఉదాహరణలు కూడ గలవు. వారిని తమ ఇంటికి తీసుకెళ్ళిరి. ఇంటికి చేరుకోగా కొంచమే ఆహారము, పానీయము గలదని తెలిసినది. హజ్రత్ ఆయిషా (రజి) తో అడగగా మీ ఇఫ్తారి కొరకు కొంచెము వుంచబడినదని వారు చెప్పిరి. ఇంట్లో అది మాత్రమే గలదు. ఇంకేమి లేదు. వారు దానిలో కొంచెం రుచి చూచి ఇప్పుడు నీవు భుజించమని అథితితో అనిరి. హజ్రత్ ఆయిషా కథనము మేరకు వారి ఇఫ్తారి కొరకు గల కొంచెం ఆహారముతో ఆ అథతి పుష్టిగా భుజించెనని కూడ హదీసు ద్వారా తెలియును.

వారు తమ అనుచరులను ఏ విధముగా తీర్చిదిద్దిరనగా వారు కూడ ఆథిత్య ఉత్సాహము కలిగియుండిరి. వారు నిర్దేషించినదే అథతి హక్కు. అతని హక్కు చెల్లించమని వారు విశ్వాసులకు సూచించిరి. ఇది వారి సల్లల్లాహు అలైహి వసల్లం సంస్కరణ ప్రభావమే. అనుచరులలో కూడ వారి సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శమును అనుసరించే ఉత్సాహము యుండెను. అందుకే అనుచరులలో కూడ ఆథిత్యము గురించి ఆశ్చర్యకర

ఉదాహరణలు లభించును. అల్లాహ్‌ను సంతోషపెట్టిన ఉదాహరణలు కూడ గలవు. అథతికి సేవ చేయబడుచున్న సందర్భము ఆ సంతోషమును అల్లాహ్ తన ప్రవక్తకు కూడ తెలిపెను. వారు ఎంత గొప్ప స్థాయి గల ఆథిత్య నిర్వహకులు. భార్య, భర్త, పిల్లలపై అల్లాహ్ సంతోషమును ప్రకటించెను. అల్లాహ్ తరపున వారికి ప్రశంసము లభించెను. దీని వివరణ ఒక హదీసులో ఇట్లు ప్రస్తావించబడెను.

హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్‌హు ఇట్లు తెలిపిరి. ఒక ప్రయాణికుడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చెను. అథితి కొరకు భోజనము పంపవలసిందిగా వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇంటికి సందేశము పంపిరి. ఇంట్లో నేడు నీరు తప్ప మరేమి లేదని సమాధానము వచ్చెను. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ అథితి కొరకు ఎవరు భోజనము ఏర్పాటు చేయునని అనుచరులను అడిగిరి. నేను ఏర్పాటు చేయుదునని ఒక అన్సారి వేడుకొనెను. అతడు ఇంటికి వెళ్ళి తన భార్యతో ఇట్లనెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అథితి కొరకు భోజనము ఏర్పాటు చేయుము. భార్య ఇట్లనెను. నేడు పిల్లలకు తప్ప మనము భుజించుటకు ఏమియును లేదు. భర్త ఇట్లనెను. నీవు భోజనము సిద్ధము చేయుము. ఆ తర్వాత దీపము వెలిగించుము. పిల్లలు భుజించే సమయము వచ్చినప్పుడు వారిని బుజ్జగించి పండుకునేటట్లు చేయుము. స్త్రీ భోజనము సిద్ధము చేసెను. దీపము వెలిగించెను. ఏదో చేసి పిల్లలను పడుకోబెట్టెను. దీపము సరి చేసే సాకుతో ఆమె నిలిచి దీపము ఆర్పివేసెను. ఇద్దరు అథితితో పాటు కూర్చొనిరి. వారు కూడ భోజనము చేయుచున్నారని వ్యక్తపరచిరి. వారిద్దరు ఆకలితో రాత్రి పడుకొనిరి. ఉదయం ఆ అన్సారి హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చినప్పుడు వారు (స) నవ్వి ఇట్లనిరి. రాత్రి మీరు చేసిన ఉపాయముతో అల్లాహ్ కూడ నవ్వెను. లేదా మీ ఇద్దరి ఈ కార్యమును అల్లాహ్ ఇష్టపడెనని అనిరి. ఈ సందర్భముననే ఈ సూక్తి అవతరించినట్లు పలు కథనాలు గలవు. وَيُؤْثِرُوْنَ عَلٰٓى اَنْفُسِهِمْ وَلَوْ كَانَ بِهِمْ خَصَاصَةٌ ۗ وَمَنْ يُّوْقَ شُحَّ نَفْسِهٖ فَاُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ (అల్‌హష్ర్:10) అనగా స్వయముగా వారికి ఇబ్బందులున్నను తన ప్రాణముల కంటే ఇతరులకు ప్రాధాన్యతనిచ్చువారు. కనుక ఎవడేని ఆత్మ పిసినారి తనముతో రక్షించబడినచో జయము నొందు వారు వీరే.

కావున నేడు మనము ఈ విషయమును దృష్టియందుంచుకొను అవసరము గలదు. ఈ రోజులలో వచ్చే అథితులు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రియుని అథితులు. ధార్మిక ఉద్దేశముతో ప్రయాణము చేయు అథితులు. నేడు ఉద్దేశము ఒక్కటే అయినా పరిస్థితులు వేరు గలవు. ఇక్కడ సర్వము సమకూర్చి వివిధ నిర్వహణల ఆధ్వర్యములో సేవ చేయుటకు తమను తాము సమర్పించమని సేవకులను అనబడును. జమాఅత్ వ్యవస్థ ఇతర వసతులు సమకూర్చును.

నేను చెప్పినట్లు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అథితుల సేవకు నియమించబడినందుకు మీరందరు స్త్రీ, పురుషులు, పిల్లలు ఎంతో అదృష్టవంతులు. ఈ కాలములో తన యజమాని విధేయతలో భాగంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఆదర్శములు కనిపించును. అథితుల ఆథిత్యము కొరకు వారు తన విశ్రాంతిని త్యాగము చేసిరి. చలికాలములో పై పరుపు లేకుండానే రాత్రి గడిపిరి. ఆహార ఏర్పాట్లకు నగదు అవసరముండి హజ్రత్ అమ్మాజాన్ ఆభరణమును కూడ వినియోగించిరి. ఇదే త్యాగ స్ఫూర్తిని వారి అనుచరులు కూడ మనకు చూపిరి. వారు తమ విశ్రాంతిపై ఇతరుల విశ్రాంతికి ప్రాధాన్యత ఇచ్చేవారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సభ గురించి ఇట్లు తెలిపిరి. మా సభ్యులు తమపై ఇతరులకు ప్రాధాన్యత

ఇచ్చు వరకే పరిమితం కాకుండా త్యాగములు ఇవ్వవలెను. మన సేవకులకు ఇదొక పాఠము. కొన్ని సందర్భాలలో కొన్ని పరిస్థితులలో ఎక్కడైనా ఆహార కొరత ఏర్పడినచో ఇబ్బంది చెందక అతిథుల కొరకు త్యాగము ఇవ్వవలెను.

మరల వారి అలైహిస్సలాం ఒక ఆదర్శమును ప్రస్తావించదలచితిని. ఇది మన పని చేయు హోదా దారులకు ఒక ఆదర్శము కాగా సేవకులకు కూడ పాఠము గలదు. హజ్రత్ షేఖ్ యాకూబ్ అలి ఇర్ఫాని గారిట్లు వ్రాసిరి. జంగె ముఖద్దస్ కార్యక్రమము సందర్భమున చాలా మంది ప్రోగైరి. ఒక రోజు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కొరకు ఇంట్లో ఆహారము తీసిపెట్టే విషయమును మరచిపోతిని. నేను నా భార్యకు గట్టిగా చెప్పి వుంటిని. కాని ఆమె పని భారం వలన మరచిపోయెను. రాత్రి చాలా పొద్దుపోయినది. హజ్రత్ గారు చాలా సమయము వరకు నిరీక్షించి ఆహారము గురించి అడిగిరి. అందరికి కలత కలిగెను. బజారు కూడ మూసి వేయబడెను. ఆహారము లభించలేదు. విషయ పరిస్థితి హుజూర్‌కు తెలుపబడెను. ఇంత కలత చెందవలసిన లేదా బాధపడవలసిన అవసరమేమున్నది. ఆహార తెరలో ఏమైనా మిగిలి వుండవచ్చును, చూడుము. అదే సరిపోవును. ఆహారతెరను చూడగా అందులో కొన్ని రొట్టె ముక్కలుండెను. ఇవే సరిపోవును అని వారనిరి. వాటిలో నుండి ఒకటి రెండు ముక్కలు మాత్రమే తీసుకొని తినిరి. షేఖ్ యాఖూబ్ అలి గారిట్లు వ్రాసిరి. ఈ సంఘటన చాలా సాధారణముగా కనిపించును. కాని దీనితో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నిరాడంబరత, వినమ్రతను సూచించే గొప్ప ప్రవర్తనల మహిమ స్పష్టమగును. అప్పుడు క్రొత్తగా ఆహార ఏర్పాటు జరిగే అవకాశముండెను. అందులో అందరికి ఆనందము కలిగేది. కాని వారు ఈ అసందర్భమున బాధ పెట్టుటకు ఇష్ట పడలేదు. అతి రుచికరమైన ఆహారము వారికి లభించలేదని కూడ బాధ పడలేదు. ఈ నిర్లక్ష్యము, అశ్రద్ధ వలన కూడ ఎవరిని ప్రశ్నించలేదు, కోపమును ప్రదర్శించలేదు. ఇంతేగాక ఎంతో ఆనందము, విశాల హృదయముతో ఇతరుల కలతను దూరము చేసిరి.

కావున ఎప్పుడైనా ఇటువంటి సంఘటన ఎదురైనప్పుడు ఈ విషయమును గుర్తుంచుకోవలెను. అల్లాహ్ కృపానుసారము మన సేవకులలో అధికులు మంచి ప్రవర్తన చూపువారే, ఇటువంటి వాటిని పట్టించుకోరు. కాని కొన్ని సందర్భాలలో ఫిర్యాదు చేసేవారు కూడ కొందరుందురు. వారు కూడ దీనిని గుర్తుంచుకోవలెను. కాని ప్రతి శాఖ అధికారి, ఆహార శాఖ, ఆతిథ్య శాఖ కూడ తమ సేవకుల కొరకు ముందే ఏర్పాటు చేయవలెను. ఆహారము లేదా ఏది వున్నా వారు డ్యూటి ముగించుకొని వచ్చినప్పుడు వారికి అందించబడ వచ్చును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకొక ప్రధాన ఉపదేశము చేసిరి. దానిని సేవకులు గుర్తుంచుకోవలెను. అతిథి ఏర్పాట్లు, ఆతిథ్యము గురించి ప్రస్తావించగా వారిట్లనిరి. ఏ అతిథికి ఇబ్బంది కలగకూడదని నాకు సదా ఆలోచన వుంటుంది. ఇంతే కాక అతిథులకు ఇబ్బంది కలగకూడదని నేను ఎల్లప్పుడు ఆదేశించుచుందును. అతిథి హృదయము అద్దము వలె సున్నితముగా నుండును. కొంచెం బాధ కలిగినా పగిలిపోవును. ఇంతకు ముందు నేనిట్లు ఏర్పాట్లు చేసివుంటిని. నేను కూడ అతిథుల వెంట భుజించేవాడిని. కాని వ్యాధి తీవ్రమైనప్పటి నుండి పథ్యముతో కూడిన ఆహారము భుజించవలసి వచ్చుచున్నది. అందుకే ఆ ఏర్పాటు కొనసాగ లేదు. ఇంకా అతిథుల సంఖ్య ఎంతో పెరగడం వలన స్థలము సరిపోవడం లేదు. అందుకే తప్పని స్థితుల వలన వేరే కావలసి వచ్చినది. తన బాధను చెప్పుకునే అనుమతి మా తరపున ప్రతి ఒక్కరికి గలదు. కొందరు రోగులుందురు. వారి కొరకు విడిగా ఆహారము ఏర్పాటు చేయవచ్చును.

కావున ఎప్పుడు కూడ ఏ అతిథికి ఎలాంటి బాధకలగకూడదను విషయమును ఎల్లప్పుడు

గుర్తుంచుకోవలెను. ప్రతి సందర్భమున, ప్రతి సమయమున ఉత్తమ ప్రవర్తనలను ప్రదర్శించుట ప్రతి సేవకుని కర్తవ్యము. ఎవరైనా బాధను వ్యక్తపరచినా అతనికి నిర్లక్ష్యముతో సమాధానము ఇచ్చే బదులు అతని బాధను దూరము చేయుటకు ప్రయత్నించవలెను.

చివరలో నేను చెప్పదలచినదేమనగా వివిధ శాఖలలో ఇప్పుడు సేవకులు చాలా శిక్షణ పొందియున్నారు. తమ పనులను మంచిగా అర్థము చేసుకున్నారు. పని చేయు విధానము కూడ వారికి తెలుసు. కాని కొన్ని సందర్భాలలో మితిమీరిన ఆత్మ విశ్వాసము కూడ ఏర్పాట్లలో లోపములకు కారణమగును. ఆత్మ విశ్వాసము వుంచుకొనుము. కాని సూక్ష్మాతి సూక్ష్మముగా ప్రతి విషయములోని భాగాలలో శ్రద్ధ వహించుటలో అలసత్వము చేయకుము.

మరల రెండో విషయమేమనగా సెక్యూరిటి విభాగము ప్రత్యేకంగా చురుకుగా వుండవలసిన అవసరము గలదు. ప్రపంచములో జమాఅత్ పరిచయమగుచున్న, ప్రగతి చెందుచున్న ప్రకారమును చూచి ఈర్ష్యపరుల, వ్యతిరేకుల సంఖ్య కూడ పెరుగుచుండును. జమాఅత్‌నకు వ్యతిరేకముగా ప్రణాళికలు రూపొందించుటలో కూడ వారి ప్రయత్నాలు అధికమగుచున్నవి. కావున ప్రతి శాఖ అన్ని రకాలుగా ఇప్పటి నుండే చురుకుగా వుండవలసిన అవసరము గలదు. సెక్యూరిటి వారు పూర్తి లోతుగా, దీర్ఘంగా నిఘా పెట్టడంతో పాటు సత్‌ప్రవర్తన ప్రత్యక్షములో తేడా రాకూడదు. ప్రతి చోట చెకింగ్ పాయింట్ల వద్ద డ్యూటి ఇచ్చేవారు మర్యాదగా ప్రవర్తించవలెను. ప్రతి చోట పిల్లలు మాత్రమే వుండకూడదు. పెద్ద వారు అనుభవము గలవారు కూడ ప్రతి చోట వుండవలెను. అన్నిటి కంటే పెద్ద విషయమేమనగా పని చేయువారందరు తమ కార్యములు ఉన్నత రీతిలో ముగించుటకు దుఆ చేయవలెను. మన పనులన్ని ఏదేని ప్రావీణ్యత, నైపుణ్యం వలన కాక అల్లాహ్ సహాయముతో అగును. అల్లాహ్ శుభము, దయను పొందుటకు దుఆ అతి ముఖ్యమైనది. దీనిని మనమెన్నడు మరచి పోకూడదు. సేవకులేగాక మనమందరము, ప్రతి ఒక్కరు కూడ దుఆ చేయవలెను. సభా ఏర్పాట్లన్నిటిని అల్లాహ్ తన దయతో సకాలంలో పూర్తి చేయుగాక! అథితులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించుగాక!

*Summarized by: Majlis Ansarullah Bharat, Translated by:Hafiz Syed Rasool Niyaz, For Telugu Desk*
Published by: Nazarath Nashr-O-Isha'ath, e-mail:telugudesk@yahoo.in
P.O.:Qadian, Dist:Gurdaspur, Pin:143516, Punjab

**BOOK POST (PRINTED MATTER)**

To,

..........................................................................

..........................................................................